నెలలైనా.. ఏళ్లయినా.. న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు!

ఎన్నికల వ్యవస్థను ధ్వంసం చేశారు.. రాజ్యాంగాన్ని పక్కనపెట్టారు

జంతర్ మంతర్‌పై ఆంక్షలను సవాల్ చేస్తాం

మోదీ, అమిత్ షా సహా బాధ్యుల చుట్టూ ఉచ్చు బిగుస్తోంది

సుప్రీంకోర్టుపై గౌరవం ఉంది..

న్యాయ పోరాటంతోపాటు రాజకీయ పోరాటం కొనసాగుతుంది

ప్రజల తిరుగుబాటు ఆగదు..

అంతిమ విజయం ప్రజాస్వామ్యానిదే

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ

అక్షరశక్తి

The Power of Pen

Evening Daily

సంపుటి: 20 | సంచిక: 333 | వరంగల్ | మంగళవారం, 13 అక్టోబర్ 2026 | పేజీలు: 06



పోరాటం ఆగదు!

ప్రజాస్వామ్య పునరుద్ధరణే లక్ష్యం!

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సాగిస్తున్న పోరాటం ఒక్కరోజుతోనో, కొన్ని నెలలతోనో ముగిసేది కాదని, న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం పనితీరును నిరసిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్‌తో ఢిల్లీలో కొనసాగుతున్న ఆందోళనల నేపథ్యంలో ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల ప్రక్రియ, రాజ్యాంగ విలువలు దెబ్బతిన్నాయని ఆరోపించిన రాహుల్.. వీటిని పునరుద్ధరించడమే తమ ఉద్యమ లక్ష్యమని ప్రకటించారు. నిరసనకారులంతా వేర్వేరు అంశాలపై పోరాడుతున్నట్లు కనిపించినా, తమ పోరాటమంతా ఒకే లక్ష్యంతో సాగుతోందని చెప్పారు. జంతర్ మంతర్‌లో ప్రజలు తమ నిరసన గళాన్ని వినిపించకుండా చేసే ప్రయత్నాలను సవాల్ చేస్తామని స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థపై తమకు అపారమైన గౌరవం ఉందని చెబుతూనే, కోర్టుల పరిధికి అతీతంగా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాజకీయ పోరాటం కూడా కొనసాగుతుందని తేల్చిచెప్పారు. - అక్షరశక్తి, డెస్క్ (న్యూఢిల్లీ)

4

రాహుల్‌గాంధీని కలిసిన డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని వినతి

అక్షరశక్తి, వరంగల్ : ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాదిగ సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ కలిసి, గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలని కోరుతూ తన బయోడేటాను రాహుల్ గాంధీకి అందించారు. రాష్ట్రంలోని మాదిగ సంఘాలు, దళిత సంఘాలు, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ సంఘాలతో పాటు ఉద్యోగ సంఘాలు, ప్రజా సంఘాలు, ఉద్యమకారుల సంఘాలు రాష్ట్రవ్యాప్తంగా విలేకరుల సమావేశాలు నిర్వహిస్తూ తనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని కోరుతున్న విషయాన్ని రాహుల్ గాంధీకి డా. రామకృష్ణ వివరించారు. కాంగ్రెస్ కార్యకర్తలు కూడా ముఖ్యనాయకులను కలిసి రామకృష్ణకు ఎంఎల్సీ అవకాశం ఇవ్వాలని కోరుతున్నారన్నారు. వీటన్నింటికి సంబంధించిన పూర్తి వివరాలు రాహుల్ గాంధీకి అందజేశారు. రామకృష్ణ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి డా. పెరుమాండ్ల రామకృష్ణ ధన్యవాదాలు తెలిపారు.



బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించాలి

- బతుకమ్మ వేడుకల ఫొటోలు, వీడియోలతో విస్తృత ప్రచారం కల్పించాలి
- సూపర్ ఎల్‌నినో ప్రభావాలపై బతుకమ్మ పాటలతో ప్రజలకు అవగాహన కల్పించాలి
- పర్యాటక అభివృద్ధి పనులను స్థానిక ఇంజినీరింగ్ శాఖలతో త్వరితగతిన పూర్తి చేయాలి
- రెండు వారాల్లోగా పర్యాటక ప్రాజెక్టుల డీపీఆర్ తయారీ బాధ్యతలు అప్పగించాలి
- హరిత హోటళ్ల పూర్తికి పీపీపీ విధానంలో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించాలి
- ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో ఔట్‌సోర్సింగ్ విధానంలో భద్రతా సిబ్బందిని నియమించాలి
- పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ. వాణీ ప్రసాద్



3

రంగసముద్రం చెరువు వద్ద కొండచిలువ కలకలం

మత్స్యకారుల వలకు చిక్కిన 7 అడుగుల కొండచిలువ



అక్షరశక్తి, వరంగల్: వరంగల్ ఉరుసు ప్రాంతంలోని రంగసముద్రం (రంగా) చెరువు వద్ద భారీ కొండచిలువ కలకలం రేపింది. మత్స్యకారులు చేపల వేట కోసం చెరువులో వేసిన వలకు సుమారు 7 అడుగుల పొడవు, 15 కిలోల బరువున్న కొండచిలువ చిక్కుకుంది. దీంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే మత్స్యకారులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని కొండచిలువను సురక్షితంగా పట్టుకున్నారు. అనంతరం దానిని జూ పార్కులో వదిలేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. చెరువు వద్ద కొండచిలువ కనిపించడంతో స్థానికులు ఆసక్తిగా గమనించారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

హనుమకొండ 327 నూతన కమిటీ సభ్యుల పరిచయ కార్యక్రమం



అక్షరశక్తి, హనుమకొండ: హనుమకొండ జిల్లా ఐఎన్టీయూసీ 327 కార్మిక సంఘం నూతన జిల్లా కమిటీ సభ్యుల పరిచయ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ సామ్య నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇంటక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇనుగాల శ్రీధర్, ఎన్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు పి. మహేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎస్ఈ సామ్య నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, కార్మికుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా నూతన అధ్యక్షుడు చిట్ల ఓదెలు, కార్యదర్శి దొనికెల సదయ్య, సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ వి. సునీల్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్లు జె. రమేష్, ఎం. సోమయ్య, అదనపు కార్యదర్శి కుంభం సుధాకర్, ముఖ్య ఉపాధ్యక్షులు ఎం. శ్రీనివాస్, పి. అమరేందర్, బి. వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు సయ్యద్ బాబా, జి. వెంకటరాజిరెడ్డి, వి. మహేందర్, జి. అశోక్, సంయుక్త కార్యదర్శి ఎస్. రాజు, కోశాధికారి జి. పోచాలు, మీడియా కార్యదర్శి సి.హెచ్. సతీష్‌కుమార్, మహిళా ప్రతినిధి సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ రథం పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



అక్షరశక్తి, హన్మకొండ: భద్రకాళి దేవాలయంలో రథోత్సవం నిర్వహణకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో రూపుదిద్దుకుంటున్న ఉత్సవ రథం పనుల పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. రథోత్సవ ఏర్పాట్ల వివరాలను ఆలయ ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు, ఆలయ కార్య నిర్వహణాధికారి సునీత ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆలయ మాడవీధుల్లో ఉత్సవ రథం సజావుగా తిరిగేందుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. భద్రకాళి చెరువులో తగినంత నీటి వసతి లేనందున తెప్పోత్సవానికి తాత్కాలికంగా నీటి కొలను ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ శాఖ ఎస్ఈ రాంప్రసాద్, అధికారులను ఆదేశించారు. అదేవిధంగా భద్రకాళి తాగునీటి జలాశయాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సాగునీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. భద్రకాళి తాగునీటి జలాశయానికి దేవాదుల నీరు చేరేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ రాజ్ కుమార్, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఇరిగేషన్ డీఈ మధుసూదన్ రెడ్డి, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జనాభా గణన రెండో దశను పకడ్బందీగా నిర్వహించాలి

- **గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్‌పాయి**
- **ఛార్జ్ క్లర్కులు, టెక్నికల్ అసిస్టెంట్లకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం**



అక్షరశక్తి, గ్రేటర్ వరంగల్ : జనాభా గణన రెండో దశను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు క్షేత్రస్థాయి సిబ్బందికి సంబంధిత నిబంధనలు, ప్రశ్నావళి, సాంకేతిక అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి/హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సూచించారు. మంగళవారం గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) ప్రధాన కార్యాలయంలో నగర పరిధి లోని ఛార్జ్ క్లర్కులు, టెక్నికల్ అసిస్టెంట్లకు జనాభా గణన రెండో దశపై అక్టోబర్ 13, 14 తేదీల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణా కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై, అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ శిక్షణలో భాగంగా మొదటి దశలో చేపట్టిన హౌస్ లిస్టింగ్ ఆపరేషన్ (HLO) బ్లాకులను ఎన్యుమరేషన్ బ్లాకులుగా మార్చే విధానం, వెబ్ పోర్టల్ ద్వారా చేపట్టాల్సిన సాంకేతిక ప్రక్రియలు, ఎన్యుమరేషన్ బ్లాకుల కేటాయింపు, జనాభా గణనలో ఎవరూ మినహాయింపునకు గురికాకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అలాగే, ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు ఇంటింటికీ వెళ్లి సేకరించాల్సిన వివరాలతో పాటు మొదటిదశలో భాగం గా ఏమైనా లోపాలు సవరించడం తో పాటు ప్రశ్నావళిలోని కీలక అంశాలు, జనాభా వివరాల్లో లోపాలు లేదా వ్యత్యాసాలు ఉన్నప్పుడు వాటిని గుర్తించి సరిచేసే విధానాలపై అవగాహన కల్పించారు. కేటాయించిన ప్రాంతాల్లోని ప్రతి కుటుంబం, ప్రతి వ్యక్తి వివరాలు సమగ్రంగా నమోదు అయ్యేలా చూడటంతో పాటు, జనాభా గణనలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సాంకేతిక వ్యవస్థను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెన్సస్ విభాగం హైదరాబాద్ నుండి సీహెచ్ సతీష్, జూనియర్ టెక్నికల్ సూపర్ వైజర్ ప్రశాంత్ పాల్గొని, వెబ్ పోర్టల్ వినియోగం, బ్లాకుల మార్పులు, జనాభా వివరాల నమోదు తదితర అంశాలపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఓ సత్యనారాయణ రెడ్డి, జీడబ్ల్యూఎంసీ అదనపు కమిషనర్ ఇసంపల్లి జోనా బల్దియా ఇన్చార్జి సిటీ ప్లానర్ రవీంద్ర రెడేకర్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గవర్నర్ కోటాలో డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణకు ఎమ్మెల్సీ ఇవ్వాలి

- **బహుజన రాజ్యాధికార సంస్థ అధ్యక్షురాలు పోత సునీత**



అక్షరశక్తి, హైదరాబాద్ : తెలంగాణలో పేదల డాక్టర్ గా, అణగారిన వర్గాల గొంతుకగా,దళిత బహుజనుల హక్కుల కోసం 20 ఏళ్లుగా సేవలందిస్తున్న డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణకు నవంబర్ లో ఖాళీ కానున్న గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని బహుజన రాజ్యాధికార సంస్థ రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు పోత సునిత డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్ లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ డాక్టర్ రామకృష్ణ ఒక వైద్యుడిగా తన రామకృష్ణ హాస్పిటల్ ద్వారా వేలాది మంది నిరుపేదలకు ఉచిత వైద్యం అందిస్తున్నారని,రామకృష్ణ ట్రస్ట్,కేమాక్స్ సహకార సంస్థ ద్వారా పేదలకు ఆర్థిక చేయూతనిస్తున్నారని తెలిపారు. మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా, సీనియర్ కాంగ్రెస్ నేతగా ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో కూడా డాక్టర్ రామకృష్ణ కీలక పాత్ర పోషించారని ఆమె గుర్తు చేశారు.ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, నల్గొండ జిల్లాల్లో దళితుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్నారని వివరించారు.రాజ్యాంగంలోని ఆర్టికల్ 171(3) ప్రకారం విజ్ఞానం, సహకార ఉద్యమం, సామాజిక సేవ వంటి రంగాల్లో విశేష సేవ చేసిన వారికి గవర్నర్ కోటా ఎమ్మెల్సీఇవ్వాలని, ఈ అర్హతలన్ని డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణకు ఉన్నాయని స్పష్టం చేశారు. కావున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గవర్నర్, మంత్రులు చొరవ తీసుకుని, మాదిగ సామాజిక వర్గానికి రాజకీయ ప్రాతినిధ్యం కల్పించి, అణగారిన వర్గాల గొంతును శాసన మండలిలో వినిపించే అవకాశం కల్పించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

అగ్నిమాపకంపై క్యాడెట్లకు శిక్షణ



అక్షరశక్తి, వరంగల్(మామునూర్): పి.టి.సి. మామ్నూరులో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ కంబైన్డ్ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్ (క్యాట్‌సీ-8)లో భాగంగా మంగళవారం యువ ఆపదా మిత్ర పథకంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా క్యాడెట్లకు అగ్నిమాపక పద్ధతులపై ప్రత్యక్ష శిక్షణ ఇచ్చారు.అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్నిమాపక యంత్రాల వినియోగం, బాధితులను సురక్షితంగా తరలించే విధానాలను వివరించారు.అనంతరం క్యాడెట్లతో మంటలను ఆర్పించే ప్రదర్శన నిర్వహించారు. అదేవిధంగా భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.రక్తదానం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించగా, అర్హులైన క్యాడెట్లు, ఏఎన్‌వోలు, సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా క్యాంప్ కమాండెంట్ కల్నల్ ఎస్.ఎస్.రామధురై మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమాలు యువతలో సేవాభావం, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతను పెంపొందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ రవి సుస్తరే, సుబేదార్ మేజర్ రాకేష్ సింగ్ తోమర్, శిక్షణా బృందం సభ్యులు పాల్గొన్నారు. ఈ శిక్షణ శిబిరం ఈ నెల 14 వరకు కొనసాగనుంది.

బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించాలి

- బతుకమ్మ వేడుకల ఫొటోలు, వీడియోలతో విస్తృత ప్రచారం కల్పించాలి
- సూపర్ ఎల్‌నినో ప్రభావాలపై బతుకమ్మ పాటలతో ప్రజలకు అవగాహన కల్పించాలి
- పర్యాటక అభివృద్ధి పనులను స్థానిక ఇంజినీరింగ్ శాఖలతో త్వరితగతిన పూర్తి చేయాలి
- రెండు వారాల్లోగా పర్యాటక ప్రాజెక్టుల డీపీఆర్ తయారీ బాధ్యతలు అప్పగించాలి
- హరిత హోటళ్ల పూర్తికి పీపీపీ విధానంలో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించాలి
- ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో ఔట్‌సోర్సింగ్ విధానంలో భద్రతా సిబ్బందిని నియమించాలి
- పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ. వాణీ ప్రసాద్



అక్షరశక్తి, హన్మకొండ : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని పర్యాటక సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ. వాణీ ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో బతుకమ్మ వేడుకల నిర్వహణతో పాటు పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టుల అమలు, నిధుల సమీకరణ, ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

ఈ వీసీ లో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ. వాణీ ప్రసాద్ మాట్లాడుతూ... బతుకమ్మ వేడుకలు గ్రామాలు, పట్టణాల్లో ప్రజల భాగస్వామ్యంతో పండుగ వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సూచించారు. మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. వేడుకలు జరిగే ప్రదేశాల్లో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాలు, రవాణా, పార్కింగ్, భద్రత వంటి ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. బతుకమ్మ వేడుకలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను విస్తృతంగా సేకరించి, ప్రచారం చేయాలని కలెక్టర్లకు సూచించారు. బతుకమ్మ పండుగ విశిష్టత, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు ప్రజలకు చేరువయ్యే విధంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు.

బతుకమ్మ పాటల ద్వారా సూపర్ ఎల్‌నినోపై అవగాహన కల్పించాలి

ప్రస్తుత సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వర్షపాతం, నీటి లభ్యత, వ్యవసాయం, పర్యావరణంపై ప్రభావాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎ. వాణీ ప్రసాద్ సూచించారు. బతుకమ్మ పాటల పోటీలను నిర్వహించి, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, నీటిని పొదుపుగా వినియోగించడం వంటి అంశాలు పాటల్లో ప్రతిబింబించేలా కలెక్టర్లు చొరవ తీసుకోవాలన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణమైన సందేశాలతో పాటలు రూపొందించేలా ప్రజలను, మహిళా సంఘాలను, యువతను ప్రోత్సహించాలని తెలిపారు. బతుకమ్మ వేడుకలను సాంస్కృతిక కార్యక్రమాలకే పరిమితం చేయకుండా, ప్రజలకు అవసరమైన అవగాహన కల్పించే వేదికగా కూడా వినియోగించుకోవాలని సూచించారు.

పర్యాటక అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 56 పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులను జిల్లాలకు బదిలీ చేసినట్లు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి తెలిపారు. ఇందులో నాగర్‌కర్నూల్ జిల్లాకు 20, ఖమ్మం జిల్లాకు 12, జగిత్యాల జిల్లాకు 2 ప్రాజెక్టులను అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులను సంబంధిత స్థానిక ఇంజినీరింగ్ శాఖల సమన్వయంతో చేపట్టి, నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలకు బదిలీ చేసిన పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టుల వివరాలను పరిశీలించి, వాటి పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. స్థానిక ఇంజినీరింగ్ శాఖలకు పనుల బాధ్యతలు అప్పగించి, పనుల అమలు, నాణ్యత, పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పనులు పూర్తయిన వెంటనే సంబంధిత బిల్లులను పర్యాటక కార్పొరేషన్‌కు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

రెండు వారాల్లోగా డీపీఆర్ తయారీ బాధ్యతలు అప్పగించాలి

పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులకు అవసరమైన సమగ్ర ప్రాజెక్టు నివేదికలు (డీపీఆర్) సిద్ధం చేసేందుకు తగిన కార్యాచరణ రూపొందించాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సూచించారు. అవసరమైన చోట కన్సల్టెన్సీ సహకారం కూడా అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి జిల్లాలో సంబంధిత ప్రాజెక్టుల డీపీఆర్ తయారీ బాధ్యతలను రెండు వారాల్లోగా ఇంజినీరింగ్ శాఖలకు లేదా తగిన సంస్థలకు అప్పగించాలని ఆదేశించారు. ప్రాజెక్టు పరిధి, భూమి లభ్యత, నిర్మాణ పనులు, అవసరమైన మౌలిక సదుపాయాలు, అంచనా వ్యయం, నిధుల సమీకరణ, అమలు గడువు వంటి అంశాలను డీపీఆర్‌లో స్పష్టంగా పొందుపరచాలని సూచించారు.

హరిత హోటళ్ల పూర్తికి పీపీపీ విధానంలో చర్యలు

కొన్ని జిల్లాల్లో హరిత హోటళ్ల నిర్మాణ పనులు పాక్షికంగా పూర్తయిన నేపథ్యంలో, మిగిలిన పనులను పూర్తి చేసి వాటిని నిర్వహణలోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వపై వేట్ భాగస్వామ్య (పీపీపీ) విధానంలో అవకాశాలను పరిశీలిస్తున్నట్లు ఎ. వాణీ ప్రసాద్ తెలిపారు. ప్రైవేట్ పెట్టుబడిదారుల సహకారంతో నిర్మాణ పనులను పూర్తి చేసి, నిర్దిష్ట కాలం పాటు నిర్వహణ బాధ్యతలను వారికి అప్పగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. జిల్లాలలో ఇటువంటి ప్రాజెక్టులకు ఆసక్తి చూపే ప్రైవేట్ పెట్టుబడిదారులు ఉంటే, జిల్లా స్థాయిలో వారిని గుర్తించి ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధుల సహకారం కూడా తీసుకోవాలని సూచించారు.

నిధుల వనరులను పరిశీలించి పర్యాటక ప్రణాళిక రూపొందించాలి

ప్రతి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలను గుర్తించి, సమగ్ర ప్రణాళికతో పాటు ఆకర్షణీయమైన ప్రజెంటేషన్ సిద్ధం చేయాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సూచించారు. జిల్లాలోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతాలు, చారిత్రక ప్రదేశాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలు, ప్రకృతి అందాలు, వారసత్వ ప్రదేశాలను గుర్తించి, వాటి అభివృద్ధికి అవసరమైన భూమి, మౌలిక సదుపాయాలు, అంచనా వ్యయం, అమలు విధానం, పర్యాటకుల సౌకర్యాలను ప్రణాళికలో పొందుపరచాలన్నారు. పర్యాటక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ నిధులు, కేంద్ర ప్రభుత్వ పథకాలు, స్వచ్ఛంద సంస్థల సహకారం, ప్రైవేట్ పెట్టుబడులు వంటి అన్ని అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. ముఖ్యంగా స్వదేశ్ దర్శన్ పర్యాటక అభివృద్ధి కార్యక్రమం కింద జిల్లాకు అనువైన ప్రాజెక్టులను గుర్తించి, నిధులు సమకూర్చుకునేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. పర్యాటక ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, మరుగుదొడ్లు, పార్కింగ్, వసతి, సమాచార బోర్డులు, భద్రత వంటి సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. స్థానిక కళలు, హస్తకళలు, స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులు, స్థానిక ఆహార సంస్కృతిని పర్యాటకంతో అనుసంధానం చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు పెంపొందించాలన్నారు.

ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో భద్రతా సిబ్బందిని నియమించాలి

రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకుల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎ. వాణీ ప్రసాద్ సూచించారు. ఈ మేరకు జిల్లాలకు పంపిన పర్యాటక ప్రాంతాల జాబితాను పరిశీలించి, అవసరమైన ప్రాంతాల్లో ఔట్‌సోర్సింగ్ విధానంలో భద్రతా సిబ్బందిని నియమించే చర్యలు జిల్లా స్థాయిలో చేపట్టాలని ఆదేశించారు. పర్యాటక ప్రాంతాలకు వచ్చే సందర్శకులకు సురక్షిత వాతావరణం కల్పించడంతో పాటు, సంబంధిత శాఖల సమన్వయంతో పర్యాటక సౌకర్యాలను మెరుగుపరచాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక సంస్థ ల అదనపు కలెక్టర్ (ఇంచార్జి)శేషాద్రి, డి ఆర్డీ వో శ్రీను, ఏసీపీ ప్రశాంత్ రెడ్డి వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



మహిళల భద్రతపై షీ టీమ్స్ అవగాహన సదస్సు

కాళోజీ కళాక్షేత్రంలో బుధవారం సదస్సు

అక్షరశక్తి, హనుమకొండ: మహిళల భద్రత, ఆత్మవిశ్వాసం, వేధింపులను ఎదుర్కొనే మార్గాలపై అవగాహన కల్పించేందుకు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎం. శ్వేతా ఆధ్వర్యంలో షీ టీమ్స్ ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించనున్నాయి. ఈ నెల 14న ఉదయం 10 గంటలకు హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో ఈ కార్యక్రమం జరగనుంది. ఈ సదస్సులో సైకాలజిస్ట్ డాక్టర్ బరుపాటి గోపి పాల్గొని మహిళలు, బాలికల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, ధైర్యంగా సమస్యలను ఎదుర్కోవడం, వేధింపులకు గురైనప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించనున్నారు. మహిళల భద్రతకు సంబంధించిన అంశాలను వివరించి, తమ హక్కులపై అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడనుంది. కావున తల్లిదండ్రులు తమ కుమార్తెలను ఈ కార్యక్రమానికి తీసుకువచ్చి సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పోలీస్ శాఖ, షీ టీమ్స్ సూచించాయి. మహిళల భద్రతపై అవగాహన పెంపొందించి, సురక్షిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చాయి.

'దసరా అంగడి' పోస్టర్ ఆవిష్కరణ



అక్షరశక్తి, హనుమకొండ: బగాలా మీడియా ఆధ్వర్యంలో చిరు వ్యాపారులను ప్రోత్సహించాలి అన్న ఉద్దేశంతో 14వ తేదీ బుధవారం పబ్లిక్ గార్డెన్ లో చిన్న వ్యాపారస్తులకు రూపాయి ఖర్చు లేకుండా నిర్వహించనున్న 'దసరా అంగడి' ఫ్రీ ఎక్స్‌పో అండ్ షాపింగ్ ఫెస్ట్ పోస్టర్‌ను కాంగ్రెస్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వ్యాపారులను ప్రోత్సహించాలని లక్ష్యంతో వారికి ఉచిత వేదిక ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. నగర ప్రజలంతా కుటుంబ సమేతంగా ఈ కార్యక్రమానికి వచ్చి చిరు వ్యాపారులను ప్రోత్సహించాలని ఆయన కోరారు. ఈ ఎక్స్‌పోలో ప్రజలందరికీ ఉచిత ప్రవేశం కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రదర్శనలో సద్దుల బతుకమ్మ మరియు దసరాకు కావలసిన వివిధ రకాల చీరలు, హ్యాండ్‌క్రాఫ్ట్స్, సంప్రదాయ మరియు ఆధునిక ఆభరణాలు, ప్రీమియం హోమ్‌మేడ్ చాక్లెట్లు, రుచికరమైన స్నాక్స్, ఆర్గానిక్, హెల్త్ ప్రొడక్ట్స్‌తో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎక్స్‌పోను సందర్శించే వారికి , ఫ్రీ హెల్త్ చెకప్ కార్డు తో పాటు సర్‌ప్రైజ్ గిఫ్ట్ కూడా అందించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బగలా సలహాదారులు సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్, అనుమాండ్ల నాగరాజు, బచ్చు స్వాతి, రాపోలు అనిల్ తదితరులు పాల్గొన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని 'దసరా అంగడి' ఎక్స్‌పోను విజయవంతం చేయాలని వారు కోరారు.

గ్రామీణ పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

- హోమ్‌స్టేల ఏర్పాటుకు ప్రోత్సాహం
- 30 రోజుల్లో అనుమతులు



అక్షరశక్తి, ములుగు: రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేయడంతో పాటు తెలంగాణ పండుగలు, సంప్రదాయాలు, జానపద కళలు, ప్రాచీన పాటలు, స్థానిక ఆహారపు అలవాట్లను పర్యాటకులకు పరిచయం చేసేలా నూతన పర్యాటక విధానాన్ని రూపొందించాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీ ప్రసాద్ సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో నిర్వహించిన వీడియో సమావేశంలో పర్యాటక రంగ అభివృద్ధి, బతుకమ్మ పండుగ నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించారు. పర్యాటక అభివృద్ధి పెద్ద హోటళ్లు, విడిది కేంద్రాలకే పరిమితం కాకుండా చిన్న హోటళ్లు, గృహ వసతి కేంద్రాల ఏర్పాటుతో గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాలని పేర్కొన్నారు.

అత్యాచారం కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

అక్షరశక్తి, భూపాలపల్లి: మానసిక వైకల్యం కలిగిన మహిళపై అత్యాచారానికి పాల్పడిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ భూపాలపల్లి ప్రధాన న్యాయమూర్తి జె. జీవన్ కుమార్ తీర్పు వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం.. 2021 నవంబర్ 28న టేకుమట్ల మండలం మందలోరిపేట గ్రామానికి చెందిన బండి శంకర్ (55) అదే గ్రామానికి చెందిన 40 ఏళ్ల మహిళ ఇంట్లోకి ప్రవేశించి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు అప్పటి టేకుమట్ల ఎస్‌హెచ్‌వో ఎస్ఐ కె. రమణారెడ్డి కేసు నమోదు చేయగా, అప్పటి చిట్యాల సీఐ పి. వెంకట్ దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేశారు. అనంతరం సాక్ష్యాధారాలతో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎదులాపురం శ్రీనివాస్ వాదనలు వినిపించారు. కోర్టు విచారణలో పీసీఆర్ ఇన్‌స్పెక్టర్ బి. రాజు, ఏఎస్సై జి. వెంకన్న, కానిస్టేబుళ్లు ఛ. జ్యోతి, పి. శ్వేత సహకరించారు. భరోసా లీగల్ సపోర్ట్ ఆఫీసర్ జి. రజిత బాధితురాలికి న్యాయ సహాయం అందించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు, న్యాయ సహాయక సిబ్బందిని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అభినందించారు. ఈ కేసులో ప్రస్తుత భూపాలపల్లి డీఎస్పీ ఎ. సంపత్ రావు, చిట్యాల సీఐ సతీష్, ఎస్ఐ అమూల్య తదితరులు సహకరించారు.

ఈ నెల 21 నుంచి పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు




అక్షరశక్తి, భూపాలపల్లి: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం, పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా ఈ నెల 21 నుంచి 31 వరకు జిల్లాలో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసుల త్యాగాలను స్మరించుకుంటూ పోలీస్ స్టేషన్లలో ఓపెన్ హౌస్ కార్యక్రమాలు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. షార్ట్ ఫిల్మ్, ఫొటోగ్రఫీ పోటీలతో పాటు రక్తదాన శిబిరాలు, మోటార్ సైకిల్ ర్యాలీలు చేపట్టనున్నట్లు తెలిపారు. పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులను ఆహ్వానించి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు తమ ఎంట్రీలను ఈ నెల 23వ తేదీ సాయంత్రంలోగా జిల్లా స్పెషల్ బ్రాంచ్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. అక్టోబర్ 21న జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో స్మృతి పరేడ్, పోలీస్ ఫ్లాగ్ డే కార్యక్రమాలు నిర్వహించి అమరవీరులకు నివాళులర్పించనున్నట్లు ఎస్పీ తెలిపారు.

ఉద్యోగుల పీఆర్సీ, డీఏ బకాయిలు విడుదల చేయాలి



అక్షరశక్తి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీని వెంటనే అమలు చేయడంతో పాటు పెండింగ్ డీఏ బకాయిలను విడుదల చేయాలని సాంకేతిక ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం రూ.30 వేలు చెల్లించాలని, రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన రిటైర్మెంట్ ప్రయోజనాలను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద భారీ ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. సాంకేతిక, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, రిటైర్డ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్. రామ్, ప్రతినిధులు మెట్టు రవి, వై. రవికుమార్, వి. ప్రేమ్‌సాగర్, వై. బాబు, నందయ్య పాల్గొన్నారు.

భవానీ మాలధారులకు అన్నప్రసాద వితరణ



అక్షరశక్తి, పరకాల: పట్టణంలో స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భవానీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అన్నపూర్ణాదేవి అవతారంలో ఉన్న భవానీ అమ్మవారిని పూజించిన అనంతరం భవానీ మాలధారులు, కండువాదారులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. స్థానిక తొమ్మిదో వార్డు కౌన్సిలర్, స్వర్ణకార సంఘం అధ్యక్షుడు బెజ్జంకి పూర్ణాచారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. స్వర్ణకార సంఘం సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పోరాటం ఆగదు!

- ప్రజాస్వామ్య పునరుద్ధరణే లక్ష్యం!
- నెలలైనా.. ఏళ్లయినా.. న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు!
- ఎన్నికల వ్యవస్థను ధ్వంసం చేశారు.. రాజ్యాంగాన్ని పక్కనపెట్టారు
- జంతర్ మంతర్‌పై ఆంక్షలను సవాల్ చేస్తాం
- మోదీ, అమిత్ షా సహా బాధ్యుల చుట్టూ ఉచ్చు బిగుస్తోంది
- సుప్రీంకోర్టుపై గౌరవం ఉంది..
- న్యాయ పోరాటంతోపాటు రాజకీయ పోరాటం కొనసాగుతుంది
- ప్రజల తిరుగుబాటు ఆగదు..
- అంతిమ విజయం ప్రజాస్వామ్యానిదే
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ



అక్షరశక్తి, డెస్క్ (న్యూఢిల్లీ): ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సాగిస్తున్న పోరాటం ఒక్కరోజుతోనో, కొన్ని నెలలతోనో ముగిసేది కాదని, న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం పనితీరును నిరసిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్‌తో ఢిల్లీలో కొనసాగుతున్న ఆందోళనల నేపథ్యంలో ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల ప్రక్రియ, రాజ్యాంగ విలువలు దెబ్బతిన్నాయని ఆరోపించిన రాహుల్.. వీటిని పునరుద్ధరించడమే తమ ఉద్యమ లక్ష్యమని ప్రకటించారు. నిరసనకారులంతా వేర్వేరు అంశాలపై పోరాడుతున్నట్లు కనిపించినా, తమ పోరాటమంతా ఒకే లక్ష్యంతో సాగుతోందని చెప్పారు. జంతర్ మంతర్‌లో ప్రజలు తమ నిరసన గళాన్ని వినిపించకుండా చేసే ప్రయత్నాలను సవాల్ చేస్తామని స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థపై తమకు అపారమైన గౌరవం ఉందని చెబుతూనే, కోర్టుల పరిధికి అతీతంగా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాజకీయ పోరాటం కూడా కొనసాగుతుందని తేల్చిచెప్పారు.

ఆగని పోరాటం.. వెనక్కి తగ్గేదే లేదు!

ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం సాగిస్తున్న ఉద్యమానికి కాలపరిమితి లేదని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. మూడు నెలలు కావచ్చు.. ఆరు నెలలు కావచ్చు.. ఏడాది లేదా రెండేళ్లు పట్టవచ్చని, అయినా అంతిమ లక్ష్యాన్ని సాధించే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. నిన్నటి మీడియా సమావేశంలో తాను ప్రస్తావించిన 'పెర్సీవియరెన్స్' (పట్టుదల) అనే పదమే తమ ఉద్యమానికి స్ఫూర్తి అని వివరించారు. ఈ బృందం మధ్యలోనే ఆగిపోదని, ఈరోజు కాకపోతే రేపు, రేపు కాకపోతే ఎల్లుండి.. ఎప్పటికైనా న్యాయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. పోరాటాన్ని ఏ రూపంలో ముందుకు తీసుకెళ్తారనే విషయాన్ని ఇప్పుడే వెల్లడించలేమని, అలా చెబితే ఆశ్చర్యం ఉండదని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య హక్కుల సాధనలో సహనం, నిరంతర ప్రయత్నం, పట్టుదలే తమ ప్రధాన ఆయుధాలని ఆయన మాటలు స్పష్టం చేశాయి.

ఎన్నికల వ్యవస్థపై తీవ్ర ఆరోపణలు

దేశంలో ప్రజాస్వామ్యం దెబ్బతిన్నదని, ఎన్నికల వ్యవస్థ ధ్వంసమైందని, రాజ్యాంగాన్ని పక్కనపెట్టారని రాహుల్‌గాంధీ ఆరోపించారు. ప్రజాస్వామ్య విలువలను తిరిగి నెలకొల్పేందుకు అందరూ కలిసికట్టుగా పోరాడుతున్నారని తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై తమ నిరసన కేవలం ఒక పదవిలో ఉన్న వ్యక్తికి వ్యతిరేకంగా మాత్రమే కాదని, ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకోవాలనే విస్తృత లక్ష్యంతో సాగుతోందని ఆయన అన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌తో పాటు కేంద్రంలోని ప్రధాన నాయకత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రధాని నరేంద్ర మోదీని ప్రధాన సూత్రధారిగా, కేంద్ర హోంమంత్రి అమిత్ షాను అమలు చేసిన వ్యక్తిగా అభివర్ణించారు. డెహ్రాడూన్‌లో ఉన్న మహిళా అధికారిని కూడా ప్రస్తావిస్తూ, బాధ్యుల చుట్టూ ఉచ్చు బిగుస్తోందని వ్యాఖ్యానించారు.

జంతర్ మంతర్‌పై ఆంక్షలను సవాల్ చేస్తాం

ప్రజాస్వామ్య భావాలను వ్యక్తపరచడానికి, నిరసన గళాన్ని వినిపించడానికి జంతర్ మంతర్‌ను ఉపయోగించకుండా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఈ నిర్ణయాన్ని తాము సవాల్ చేస్తామని ప్రకటించారు. భారత ప్రజలు తమ హక్కుల కోసం, తమ గొంతు వినిపించుకోవడం కోసం పోరాడరని ప్రభుత్వం భావించడం సరికాదని అన్నారు. నిరసన వ్యక్తం చేయడం ప్రజాస్వామ్యంలోకీలకమైన హక్కు అని, దానిని అడ్డుకునే ప్రయత్నాలను అంగీకరించబోమని ఆయన వ్యాఖ్యలు సూచిస్తున్నాయి. ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రశ్నిస్తూ, ప్రజల నిరసనలకు అవకాశం ఉండాలని డిమాండ్ చేశారు. జంతర్ మంతర్ వంటి వేదికలపై నిరసనల విషయంలో తీసుకునే నిర్ణయాలు ప్రజాస్వామ్య హక్కులపై ప్రభావం చూపుతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

సుప్రీంకోర్టుపై గౌరవం.. రాజకీయ పోరాటం కొనసాగింపు

సుప్రీంకోర్టు, భారత ప్రధాన న్యాయమూర్తి, న్యాయవ్యవస్థపై తమకు అపారమైన గౌరవం ఉందని రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. న్యాయపరంగా ముందుకు వెళ్లేందుకు పిటిషన్ దాఖలు చేసే మార్గాన్ని చూపినందుకు సంతోషం వ్యక్తం చేశారు. న్యాయవ్యవస్థ తన పాత్రను సమర్థంగా నిర్వహిస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. అయితే, న్యాయస్థానాలు తమ పరిధిలో ఏ విధంగా వ్యవహరించినా, రాజకీయంగా తాము చేపట్టిన పోరాటం మాత్రం కొనసాగుతుందని తేల్చిచెప్పారు. ప్రజల నిరసన, ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం ఆగబోదని, అంతిమంగా విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. న్యాయపోరాటం ఒక మార్గమైతే, ప్రజల్లో అవగాహన పెంచుతూ రాజకీయంగా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడం మరో మార్గమని ఆయన వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి.

భయపడాల్సిన అవసరం లేదు.. ధైర్యంగా నిలబడాలి

దేశ చరిత్ర, తత్వశాస్త్రం గురించి అవగాహన లేని శక్తులను చూసి భారతదేశం భయపడాల్సిన అవసరం లేదని రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడిన కాలంలో భయం ఉండటాన్ని అర్థం చేసుకోవచ్చని, కానీ నేటి పరిస్థితుల్లో ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవడానికి భయపడకుండా నిలబడాలని అన్నారు. జోకర్లు, క్లౌన్లతో దేశం బెదిరిపోవాల్సిన అవసరం లేదంటూ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై విశ్వాసం ఉన్నవారంతా ధైర్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల వ్యవస్థపై నిరసనతో ప్రారంభమైన ఆందోళనను ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం విస్తృత పోరాటంగా ముందుకు తీసుకెళ్లాలన్నది రాహుల్‌గాంధీ ప్రకటనలోని ప్రధాన సందేశం.

వరంగల్ బస్ స్టేషన్ నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలి

కుడా చైర్ పర్సన్ గుండు సుధారాణి

అక్షరశక్తి, వరంగల్: వరంగల్ బస్ స్టేషన్ నిర్మాణ అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని కుడా చైర్ పర్సన్ గుండు సుధారాణి అన్నారు. వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న బస్ స్టేషన్ పనులను, వాటి పురోగతిని హనుమకొండ జిల్లా కలెక్టర్, కుడా వైస్ చైర్ పర్సన్ చాహత్ బాజ్ పాయితో కలిసి కుడా చైర్ పర్సన్ పరిశీలించారు. బస్ స్టేషన్ నిర్మాణ, అభివృద్ధి పనులకు సంబంధించిన మ్యాపును పరిశీలించారు. పనుల పురోగతిని గురించి నిర్మాణ సంస్థ ప్రతినిధులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కుడా చైర్ పర్సన్ గుండు సుధారాణి మాట్లాడుతూ వరంగల్ బస్ స్టేషన్ త్వరగా పూర్తయ్యే విధంగా నిర్మాణ పనులు సాగాలన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టర్, కుడా వైస్ చైర్ పర్సన్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ వరంగల్ బస్ స్టేషన్ నిర్మాణ పనులు వేగవంతం చేయడంలో భాగంగా అదనంగా మరింత మంది వర్కర్స్ ను ఏర్పాటు చేయాలన్నారు. కాలమ్స్, స్లాబ్స్ రిటెయినింగ్ వాల్ పనులను ఏకకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కుడా ఈఈ భీమ్ రావు, డీఈ జలాలుద్దీన్, ఇతర అధికారులతో పాటు సంబంధిత నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



కాజీపేటకు మంజూరైన తెలంగాణ పబ్లిక్ స్కూల్

- పరిపాలనపరమైన ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ





అక్షరశక్తి, కాజీపేట : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ కాజీపేటకు మంజూరైంది. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వం పరిపాలనాపరమైన అనుమతులు ఇస్తూ ఈనెల 9వ తేదీన జీవో జారీ చేసింది. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని కాజీపేట మండల కేంద్రంలోని విద్యానగర్ లో గల ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాలలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణ పనులకు నిధులను కూడా కేటాయించడం విశేషం. అంతర్జాతీయ స్థాయిలో సౌకర్యాలు తెలంగాణ పబ్లిక్ స్కూల్ లో అంతర్జాతీయ స్థాయిలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించనున్నారు. ప్రధానంగా అధునాతన సౌకర్యాలతో కూడిన తరగతి గదులతో పాటు లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్స్, సైన్స్ ల్యాబ్ లను.. డైనింగ్ హాల్స్ నిర్మాణాలను చేపట్టనున్నారు. వీటితోపాటు ఆధునిక క్రీడా వసతులతో కూడిన క్రీడా మైదానాలను ఏర్పాటు చేసే అవకాశం ఉంది. నెరవేరనున్న చిరకాల వాంఛ పెరుమాండ్ల సాంబమూర్తి (బిసి టీచర్స్ యూనియన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు) కాజీపేటకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు కావడం హర్షనీయం. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కి బిసి టీచర్స్ యూనియన్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు. కాజీపేటలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుతో ఏళ్ల తరబడి కొనసాగుతున్న చిరకాల వాంఛ అయిన జూనియర్ కళాశాల కోరిక నెరవేరనుందని చెప్పవచ్చు. ఈ తెలంగాణ పబ్లిక్ స్కూల్లో ప్రీ ప్రైమరీ నుండి 12వ తరగతి వరకు దాదాపు 1500 మంది విద్యార్థులు చదివే అవకాశం ఉంటుంది.

అభ్యర్థుల సర్టిఫికెట్లను పారదర్శకంగా పరిశీలించాలి

జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

అక్షరశక్తి, హన్మకొండ : హనుమకొండ జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్ల భర్తీ కోసం ఇటీవల వెలువడిన ప్రకటన ఆధారంగా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న మహిళా అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్స్ పరిశీలన మంగళవారం హనుమకొండ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ లో గుండ్లసింగారం 3 కి సంబంధించిన అభ్యర్థుల సర్టిఫికెట్స్ ను అధికారులు పరిశీలిస్తుండగా ఆ ప్రక్రియను హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పరిశీలించారు. కేఎల్ఎన్ రెడ్డి కాలనీ లో ఉన్న ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ను సందర్శించి దరఖాస్తు సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... అభ్యర్థుల సర్టిఫికెట్స్ పరిశీలనలో అధికారులు పారదర్శకత, నిబంధనల ప్రకారం అర్హత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా హనుమకొండ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో, జిల్లా సంక్షేమ అధికారి ఎం. విశ్వజ మాట్లాడుతూ.... 19 పోస్టులకు గాను 953 దరఖాస్తులు వచ్చాయని నిబంధనల ప్రకారం పరిశీలిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సూపర్వైజర్లు, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఓటరు సభ్యత్వ నమోదు కార్యాలయం ప్రారంభం





అక్షరశక్తి, మడికొండ: వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతం చేసే లక్ష్యంతో గ్రేటర్ వరంగల్ పరిధిలోని కాజీపేట మండలం మడికొండలో ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ప్రారంభించారు. బీజేపీ వరంగల్ జిల్లా కార్యదర్శి పొనగోటి వెంకట్‌రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి, ఓటరు సభ్యత్వ నమోదు ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని నేతలు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ సెల్ కోకన్వీనర్ దాస్యం అభినవ భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బన్న ప్రభాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జలగం రంజిత్ కుమార్, ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకుడు గడ్డం మహేందర్, తౌటి రెడ్డి రవీందర్ రెడ్డి, నాయిని కుమార్, మానుకోట జిల్లా బీజేవైఎం ఇన్‌చార్జి తక్కళ్లపల్లి నిఖిల్‌రావు, చేన్నబోయిన శివకుమార్, పుల్యాల రవీందర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి దార ధనుంజయ్, చట్ల అజయ్, బైరి సతీష్, ఎలగొండ శివ, పసుల శ్రీకాంత్, మిట్టపల్లి హేమంత్, తాదేం రంజిత్, జాంటీ, లకావత్ నవీన్, పెట్టం సాంబయ్య, చట్ల బాబురావు, శ్రీనివాస చారి, పల్లపు యుగేందర్, కొప్పరాల సతీష్, కన్నె రాజేష్ యాదవ్, ఇల్లందుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శారద శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఆయుష్య హోమం



అక్షరశక్తి,వరంగల్: వరంగల్ నగరంలోని శ్రీనివాస కాలనీ శ్రీ శృంగేరి శంకరమఠంలో కన్నుల పండుగగా జరుగుతున్న శ్రీ శారద శరన్నవరాత్రి ఉత్సవాలు మంగళవారం మూడవరోజు చేరుకున్నాయి. ప్రధాన అర్చకులు శ్రీ సంగమేశ్వర జోషి ఆధ్వర్యంలో ఉదయం గణపతి పూజ అనంతరం శ్రీ శారదాంబ విశేష సంకల్ప పూజ, శ్రీ శారద కల్పోక్త విశేష పూజ మహా మంగళహారతి జరిగాయి.. రేణిగుంట్ల కుమారస్వామి కృష్ణకుమారి దంపతులు ఆయుష్య హోమం నిర్వహించారు. మహా మంగళ హారతి అనంతరం అన్న ప్రసాద్ వితరణ జరిగింది... వరంగల్ నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో శ్రీ శారదా అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీ శృంగేరి శంకర సేవా సమితి సభ్యులు దేవేందర్, కొమురయ్య, భాస్కర్, రామారావు, రవీందర్, M.రాజేంద్ర ప్రసాద్, కోనే భాస్కరరావు, మురళీధర్ రావ్, వాసవి, పద్మావతి, సంధ్యారాణి, శ్రీదేవిలు భక్తులకు సేవలందించారు. సాయంత్రం పుల్లూరు దేవేందర్ పద్మావతి దంపతుల లక్ష కుంకుమార్చన జరిగింది. అనంతరం గజ్జల రంజిత్ కుమార్ శిష్య బృందం పేరిణి నిత్య ప్రదర్శన భక్తులను అలరించింది.

రైతులకు న్యాయం జరిగేలా గుమస్తాల సంఘం సహకరించాలి



అక్షరశక్తి, వరంగల్: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు పంటలు విక్రయించేందుకు వచ్చే రైతులకు న్యాయమైన ధర లభించేలా గుమస్తాల సంఘం సహకరించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ కోరారు. మంగళవారం మార్కెట్ గుమస్తాల సంఘం నూతన కార్యవర్గాన్ని తెలంగాణ రైతు సంఘం నాయకులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు సుంచు జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి వంగరి వెంకటేశ్వర్లును అభినందించారు. రైతులు పంటల విక్రయానికి వచ్చినప్పుడు తూకాల్లో పొరపాట్లు జరగకుండా చూడాలని, మార్కెట్ బైలాలో నిర్దేశించిన నిబంధనలకు మించి అదనపు ఖర్చులు విధించరాదని సోమిడి శ్రీనివాస్ సూచించారు. కష్టపడి పండించిన పంటలను మార్కెట్‌కు తీసుకొచ్చే రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు గుమస్తాల సంఘం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఊరటి హంసహాల్ రెడ్డి, కమిటీ సభ్యులు బొల్లు ఎల్లయ్య, సిరుల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణ, పెండింగ్ కేసుల పరిష్కారంపై దృష్టి



అక్షరశక్తి, భూపాలపల్లి: ప్రజల భద్రతే పోలీసుల ప్రథమ కర్తవ్యమని, నేరాల నియంత్రణతో పాటు పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్షలో ఆయన పోలీస్ స్టేషన్ల పనితీరు, కేసుల దర్యాప్తు పురోగతిని సమీక్షించారు. గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల్లో పటిష్ట ఆధారాలతో దర్యాప్తు పూర్తి చేసి నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మిస్సింగ్ కేసుల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, మహిళలు, చిన్నారులపై నేరాలు, పోక్సో కేసులను నిర్దిష్ట గడువులో పరిష్కరించాలని ఆదేశించారు. దొంగతనాల నివారణకు రాత్రి గస్తీ పెంచాలని, సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. గంజాయి అక్రమ రవాణా, జూదం, సైబర్ నేరాల నియంత్రణతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, డీఎస్పీ ఎ.సంపత్ రావు, కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, సీఐలు, ఎస్ఐలు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

GUEST COLUMN

మౌనాన్ని చీల్చిన యువతరం: ‘విశిష్ట’ కథలో ప్రజాస్వామ్య చైతన్యం



వి.శాంతి ప్రబోధ

వి. శాంతి ప్రబోధ రాసిన ‘విశిష్ట’ కథ సమకాలీన భారతీయ సమాజంలో యువతలో మొలకెత్తుతున్న ప్రజాస్వామిక చైతన్యానికి, అన్యాయాన్ని ప్రశ్నించే ధైర్యానికి సాహిత్య రూపం. పరీక్షల నిర్వహణలో వైఫల్యాలు, అధికార వ్యవస్థల నిర్లక్ష్యం, పోలీసుల బలప్రయోగం, మహిళల స్వేచ్ఛపై సామాజిక ఆంక్షలు, తల్లిదండ్రుల భయాలు వంటి అంశాలను ఒక యువతి అంతర్మథనం ద్వారా రచయిత్రి ఆవిష్కరించారు. ఈ కథలో ఢిల్లీకి వెళ్లిన విశిష్ట ప్రయాణం కేవలం ఒక నగరానికి చేరుకోవడం కాదు; నిర్లిప్తత నుంచి బాధ్యత వైపు, భయం నుంచి ఆత్మవిశ్వాసం వైపు, ప్రేక్షకురాలి స్థానం నుంచి క్రియాశీల పౌరురాలి స్థానం వైపు సాగిన చైతన్య ప్రయాణం.

బూడిదరంగు మేఘాల కింద నిరసనకారులపై లాఠీదెబ్బలు, టియర్ గ్యాస్ దృశ్యాలను ఫోన్‌లో చూస్తున్న విశిష్టతో కథ ప్రారంభమవుతుంది. ఆ దృశ్యాలు ఆమెను కదిలిస్తాయి. అయితే ఉద్యమంలో పాల్గొనాలనే కోరిక కలగగానే తనను తాను ప్రశ్నించుకుంటుంది. నిజంగానే బాధితుల పట్ల సానుభూతి ఉందా? లేక సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు పెట్టుకొని లైకులు పొందాలనే ఆకర్షణా? ఈ ఆత్మవిమర్శ కథానాయికను సాధారణ ఉద్వేగపూరిత యువతిగా కాకుండా, తన ఉద్దేశాలను విశ్లేషించుకోగల వ్యక్తిగా నిలబెడుతుంది. ఉద్యమంలోకి అడుగుపెట్టకముందే తన మనస్సాక్షి ముందు నిలబడటం ఆమె చైతన్యానికి తొలి సంకేతం.

నీట్ పరీక్ష కోసం రెండేళ్లు శ్రమించిన యశ్వంత్ ప్రశ్నపత్రం లీకేజీతో భవిష్యత్తు దెబ్బతిని ఆత్మహత్య చేసుకున్న విషాదం విశిష్ట ఆలోచనలను మలుపు తిప్పుతుంది. ఇక్కడ రచయిత్రి వ్యక్తిగత విషాదాన్ని వ్యవస్థాగత వైఫల్యంతో అనుసంధానించారు. పరీక్షల నిర్వహణలో అక్రమాలు విద్యార్థుల శ్రమను మాత్రమే కాదు, సమాన అవకాశాలపై వారి నమ్మకాన్ని, కుటుంబాల ఆశలను కూడా ధ్వంసం చేస్తాయి. అయితే ఆత్మహత్యకు ఒకే కారణాన్ని ఆపాదించలేమనే వాస్తవాన్ని గుర్తిస్తూ, విద్యార్థుల మానసిక ఒత్తిడిని తగ్గించడం, పరీక్షా వ్యవస్థలో పారదర్శకతను నిర్ధారించడం ప్రభుత్వ బాధ్యత అని కథ సూచిస్తుంది. యశ్వంత్ జ్ఞాపకం విశిష్టలోని సానుభూతిని సామాజిక బాధ్యతగా మారుస్తుంది.

సానియా, మాలిని, ప్రణీత పాత్రలు యువతలోని భిన్న మనస్తత్వాలను ప్రతిబింబిస్తాయి. ఒకరు సమస్యను పట్టించుకోరు, మరొకరు భద్రత గురించి భయపడతారు, ఇంకొకరు వినోదానికే ప్రాధాన్యమిస్తారు. ఈ పాత్రల ద్వారా ఇతరుల బాధను తమ సమస్యగా భావించలేని సామాజిక నిర్లిప్తతను రచయిత్రి ప్రశ్నించారు. అయితే ఉద్యమాలకు దూరంగా ఉండేవారందరినీ స్వార్థపరులుగా చూడలేం; భయం, అవగాహన లోపం, కుటుంబ బాధ్యతలు కూడా కారణాలవుతాయి. ఈ భిన్నత్వాన్ని గుర్తించినప్పుడే కథలోని విమర్శ మరింత సమగ్రంగా అర్థమవుతుంది.

రైలు ప్రయాణంలో విశిష్ట ఎదుర్కొనే పురుషుల వ్యాఖ్యలు కథలోని పితృస్వామ్య భావజాలాన్ని బయటపెడతాయి. ఉద్యమాల్లో పాల్గొంటే కెరీర్ పాడవుతుందని, పెళ్లి సంబంధాలు రావని హెచ్చరించడం ద్వారా మహిళ జీవితాన్ని వివాహం, కుటుంబ గౌరవం అనే పరిమితుల్లో బంధించే సంప్రదాయ దృక్పథాన్ని రచయిత్రి విమర్శించారు. “ఆడపిల్లగా నా గురించి నేను ఆలోచించకూడదా? ప్రశ్నించకూడదా?” అనే విశిష్ట ప్రశ్న కథలో కీలకమైన మలుపు. మహిళల భద్రతపై ఆందోళన సమంజసమే అయినా, దాన్ని వారి స్వేచ్ఛను అణచివేసే సాధనంగా ఉపయోగించడం అన్యాయం. స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే హక్కు మహిళలకూ సమానంగా ఉందని ఈ సందర్భం బలంగా చెబుతుంది.

తల్లిదండ్రుల ఆందోళనను రచయిత్రి మానవీయంగా చిత్రించారు. బిడ్డ భద్రత, భవిష్యత్తుపై వారి భయం సహజమే. అయినప్పటికీ, విశిష్ట తన తోటి విద్యార్థుల భవిష్యత్తు కోసం వెళ్లాలనే నిర్ణయాన్ని వివరించినప్పుడు వారి వైఖరిలో మార్పు వస్తుంది. ఈ పరిణామం తరాల మధ్య సంఘర్షణను శత్రుత్వంగా కాకుండా, భద్రతా భావనకు స్వతంత్ర ఆలోచనకు మధ్య జరిగే సంఘర్షణగా చూపిస్తుంది.

జంతర్‌మంతర్ వద్ద విశిష్ట చూసే దృశ్యాలు కథకు విస్తృతమైన సామాజిక అర్థాన్ని అందిస్తాయి. భిన్న భాషలు, కులాలు, మతాలు, ప్రాంతాలకు చెందిన యువత ఒకే లక్ష్యంతో ఏకమవడం రాజ్యాంగంలోని సమానత్వం, సౌభ్రాతృత్వ స్ఫూర్తిని ప్రతిబింబిస్తుంది. ఆహారం, నీళ్లు పంచుకోవడం, బాధితుల మాటలు వినడం, అలసిపోయినవారికి సాయం చేయడం ద్వారా ఉద్యమంలోని మానవీయతను రచయిత్రి చూపించారు. యువతను ఆకతాయిలుగా చిత్రించే పెద్దల దృష్టికి ఇది సమర్థవంతమైన సమాధానం.

పోలీసుల లాఠీచార్జి, టియర్ గ్యాస్, బారికేడ్ల మధ్య యువత చూపే పట్టుదల కథలో అధికారాన్ని ప్రశ్నించే పౌరుడి శక్తిని ప్రతిబింబిస్తుంది. యువత ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వకుండా వారి వెనుక ఎవరు ఉన్నారంటూ అనుమానించడం, నిరసనలను కుట్రలుగా చిత్రించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమైన ధోరణులు. అధికార అనుకూల మీడియా నిరసనకారుల సమస్యల కంటే వారి ఉద్దేశాలపై అనుమానాలకు ప్రాధాన్యమిస్తే, ప్రజాస్వామిక చర్చ దెబ్బతింటుంది. అదే సమయంలో, ఇటువంటి ఆరోపణలు, పోలీసుల దుర్వ్యవహారాలపై విమర్శలు నిర్దిష్ట ఆధారాలతో నిలబడాలి. విమర్శనాత్మక సాహిత్యం ఆవేశాన్ని రేకెత్తించడమే కాకుండా వాస్తవాలను పరిశీలించే వివేకాన్ని కూడా పెంపొందించాలి.

అదితి పాత్ర కథలోని నాయకత్వ లక్షణాలకు ప్రతీక. ఉద్రిక్త పరిస్థితుల్లో హింసకు బదులుగా సంయమనం పాటించాలని ఆమె పిలుపునివ్వడం, చలిలో వణుకుతున్న చిన్నారికి తన షాల్‌ను కప్పడం ఆమె వ్యక్తిత్వంలోని ధైర్యాన్ని, మానవత్వాన్ని తెలియజేస్తాయి. పోరాటం అంటే ప్రతీకారం కాదని, లక్ష్యంపై స్పష్టతతో క్రమశిక్షణను కాపాడుకోవడమని ఆమె ప్రవర్తన నిరూపిస్తుంది. విశిష్టలోని మార్పు అదితి వ్యక్తిత్వాన్ని అనుకరించడం వల్ల మాత్రమే కాదు; ఉద్యమంలో ఇతరుల అనుభవాలను విని, బాధను అర్థం చేసుకొని, తన బాధ్యతను గుర్తించడం వల్ల కలిగిన పరిణామం. ఇదే కథలోని మానసిక వికాసానికి ప్రధాన బలం.

రచయిత్రి భాష సరళంగా, సంభాషణలు సహజంగా ఉన్నాయి. ఫోన్ సందేశాలు, రైలు ప్రయాణంలోని మాటలు, నిరసనల నినాదాలు నేటి యువత జీవనశైలికి దగ్గరగా ఉంటాయి. వర్షం, చీకటి, టియర్ గ్యాస్, రైలు చక్రాల శబ్దం వంటి ప్రతీకాత్మక వర్ణనలు విశిష్ట అంతర్మథనానికి వాతావరణాన్ని కల్పిస్తాయి. అయితే ఉద్యమకారుల ఐక్యత, ధైర్యం కొన్నిచోట్ల ఆదర్శీకరణకు దగ్గరవుతాయి. ఉద్యమాల్లో ఉండే విభేదాలు, వ్యూహాత్మక సమస్యలు, నాయకత్వంలోని సంక్లిష్టతలకు మరింత స్థానం ఇచ్చి ఉంటే కథ వాస్తవికత పెరిగేది. అయినప్పటికీ, కథ ప్రధాన లక్ష్యం ఉద్యమ చరిత్రను నమోదు చేయడం కాదు; ఒక యువతి పౌర చైతన్యంలోకి ఎలా ప్రవేశించిందో చూపించడం. ఆ లక్ష్యాన్ని రచయిత్రి సమర్థంగా సాధించారు.

భారత రాజ్యాంగంలోని 19(1)(a), 19(1)(b) అధికరణాలు భావప్రకటన స్వేచ్ఛను, శాంతియుతంగా సమావేశమయ్యే హక్కును కల్పిస్తాయి. చట్టబద్ధమైన పరిమితులు ఉన్నప్పటికీ, ప్రభుత్వాన్ని ప్రశ్నించడం నేరం కాదు; ప్రజాస్వామ్యంలో అది పౌర బాధ్యత. ఈ స్ఫూర్తిని విశిష్ట పాత్ర ద్వారా శాంతి ప్రబోధ పాఠకుల ముందుంచారు.

కథ ముగింపులో ఇంటికి తిరిగొచ్చిన విశిష్ట మునుపటి యువతి కాదు. హైదరాబాద్‌లో అదితి ప్రసంగాన్ని వింటూ, తన అనుభవాలను మననం చేసుకుంటూ, ప్రశ్నించే హక్కు తన ఉనికిలో భాగమని గ్రహిస్తుంది. ఈ ముగింపు వ్యక్తిగత పరిణామాన్ని సామాజిక సందేశంగా విస్తరిస్తుంది. యువతను అనుమానించడం, అణచివేయడం కాకుండా వారి ప్రశ్నలకు సమాధానమివ్వడం ప్రభుత్వాల బాధ్యత. అన్యాయాన్ని చూసి మౌనంగా ఉండకపోవడం, ఆధారాలతో ప్రశ్నించడం, శాంతియుతంగా రాజ్యాంగ హక్కుల కోసం నిలబడటం నిజమైన పౌర చైతన్యం. ఆ చైతన్యానికి సాహిత్య స్వరం అందించినందుకు వి. శాంతి ప్రబోధ అభినందనీయులు. విశిష్ట కథానాయిక మాత్రమే కాదు—మౌనాన్ని విడిచి ప్రశ్నించడం నేర్చుకుంటున్న యువతరానికి ప్రతీక. ప్రజాస్వామ్యాన్ని కాపాడేది అధికారంలో ఉన్నవారి గొప్ప ప్రకటనలు కాదు; అన్యాయం ఎదురైనప్పుడు వెనుకడుగు వేయని పౌరుల ధైర్యమైన గొంతులే.



- డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.
9849328496
ramkishore.1504@gmail.com

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.